క్లుప్తంగా

నిబంధనలు పాటించండి



తనిఖీలో ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: రోడ్డు భద్రత నియమాలు పాటించాలని వాహనచోదకులకు ఎస్పీ రిషాంత్‌రెడ్డి సూచించారు. చిత్తూరు నగరం మురకంబట్టు ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి తనిఖీలు చేశారు. రోడ్డు భద్రతపై వాహనదారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా అసాంఘిక చర్యలకు ఏవైనా పాల్పడుతున్నారా అనే విషయంపై ఆరా తీశారు.

క్రీడా సామగ్రి వితరణ



విద్యార్థులకు క్రీడా పరికరాలను అందజేస్తున్న ఐల గురివిరెడ్డి ట్రస్ట్ సభ్యులు

ఐరాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఐల గురివిరెడ్డి ట్రస్ట్ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, విశ్రాంత ఎస్‌ఐ రమేష్‌రెడ్డి రూ.35 వేలు విలువ చేసే క్రీడా పరికరాలను శుక్రవారం హెచ్‌ఎం కోమల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ రవీంద్రరెడ్డి, మాజీ పీఎంసీ చైర్మన్ మురళిరెడ్డి, పీడీ దేవా, చంద్రశేఖర్‌రెడ్డి, ధవళేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ మాఫియాను అరికట్టాలి

చిత్తూరు కలెక్టరేట్ : భూ మాఫియాను అరికట్టాలని జీడీ నెల్లూరు మండలం ఈడిగపల్లె గ్రామస్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఆ గ్రామస్తులు నిరసన తెలిపారు. గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం, శ్రీరాములు మాట్లాడుతూ ఈడిగపల్లెలో ఆలయానికి సంబంధించిన స్థలాన్ని కబ్జా చేస్తున్నారని చెప్పారు. రెవెన్యూ అధికారుల సహాయంతో నకిలీ ధ్రువపత్రాలు సృష్టిస్తున్నారని వాపోయారు. సర్వే నెంబర్ 586/9లో 46 సెంట్ల భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. తహసీల్దార్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేసి న్యాయం చేయాలని వారు కోరారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా జగదీశ్వర్‌నాయుడు



చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా తవణంపల్లె మండలానికి చెందిన ఎస్.జగదీశ్వర్‌నాయుడును నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఉత్తర్వులు జారీ చేశారు. కొన్నేళ్ల నుంచి పార్టీలో ఉన్న ఈయన మండల స్థాయి నుంచి ఎదిగారు. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా, జిల్లా యువమోర్చా అధ్యక్షుడిగా, రాష్ట్ర ఈసీ మెంబర్‌గా సేవలు అందించారు.

ఈ క్రాప్ వేగవంతం చేయాలి

తవణంపల్లె: రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఈ–క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ ఏడీఏ మధుసూదన్ రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో శుక్రవారం ఈ పంట నమోదుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ మండలంలో ఈ నెల 15వ తేదీ లోపల నమోదు పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. మండల వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పూర్ణచంద్రారెడ్డి, సభ్యులు మురుగన్, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్: ముంబైలో ఈ నెల 3న నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో చిత్తూరుకు చెందిన 35 మంది విద్యార్థులు సత్తా చాటి పతకాలు సాధించారు. వీరిని శుక్రవారం చిత్తూరు నగరంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి అభినందించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

యాదమరి: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డు అందుకున్న సిద్దారెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ప్రమీల కుమారిని శుక్రవారం స్థానిక సర్పంచ్ దయానంద రెడ్డి దంపతులు ఘనంగా సన్మానించారు.



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న సర్పంచ్

- చిత్తూరు నగరం దొడ్డిపల్లికి చెందిన ఝాన్సీలక్ష్మీ 5 నెలల గర్భిణి. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో క్రమం తప్పకుండా చికిత్స తీసుకుంటోంది. ఈ నెల 2వ తేదీ డాక్టర్‌ను సంప్రదిస్తే స్కానింగ్‌కు రాశారు. (ఉదయం 11.12 గంటల సమయంలో) చీటీతో ఆమె స్కానింగ్ విభాగం వద్దకు వెళ్లింది. అక్కడ టోకన్లు ఇచ్చే సిబ్బంది రేపు రండి అని చెప్పి తలుపులు వేసుకున్నారు. అలా ఆమెను వారం రోజుల పాటు తిప్పించుకున్నారు. విధిలేక గొడవకు దిగడంతో స్కానింగ్ భాగ్యం కల్పించారు.
- ఆస్పత్రిలో పనిచేసే ఓ హెడ్‌నర్సు శుక్రవారం (మధ్యాహ్నం 12.25 గంటలకు) ఓ మహిళను స్కానింగ్‌కు తీసుకొచ్చింది. హెడ్‌నర్సు మాత్రం నేరుగా స్కానింగ్ గదిలోకి వెళ్లి డాక్టరుకు చీటీని అందించింది. 10 నిమిషాల్లో ఆ మహిళను లోపలకు పిలిచి స్కానింగ్ చేసి రిపోర్ట్ ఇచ్చేశారు.
- చిత్తూరు మండలానికి చెందిన సౌజన్య శుక్రవారం కడుపునొప్పితో ప్రసూతి విభాగంలోని డాక్టర్‌ను సంప్రదించింది. డాక్టరు ఇచ్చిన సూచన మేరకు స్కానింగ్ సెంటర్‌కు వెళితే, డ్యూటీ డాక్టరు సోమవారం రావాలని సూచించారు. కడుపు నొప్పి తీవ్రంగా ఉందని వేడుకుంటే మధ్యాహ్నం 1 గంట వరకు కూర్చోబెట్టి, ఆ తరువాత గదికి తాళం వేశారు. ఇదేమని ప్రశ్నిస్తే కుంటి సాకులతో శనివారం వచ్చేయండి అంటూ తప్పించుకున్నారు. దీంతో ఆ మహిళ అధికారులకు ఫిర్యాదు చేసింది.



చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలోని స్కానింగ్ విభాగం

స్కానింగ్ సేవలకు కత్తెర!

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని స్కానింగ్ విభాగంలో సేవలు కుంటుపడ్డాయి. మధ్యాహ్నానికే స్కానింగ్ గదికి తాళం వేస్తున్నారు. టోకెన్ల పేరుతో స్కానింగ్‌కు కత్తెర పెడుతున్నారు. కొందరికి మాత్రమే స్కానింగ్ సేవలను పరిమితం చేస్తున్నారు. సిఫార్సు ఉంటే చకచకా తీయిస్తున్నారు. మిగిలిన వారికి పురిటినొప్పులు తెప్పిస్తున్నారు. రోజుల కొద్దీ తిప్పించుకుంటున్నారు. ప్రధానంగా డ్యూటీ డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి దాపురిస్తోంది.

- టోకెన్ల పేరుతో కొందరికే స్కానింగ్
- మధ్యాహ్నానికే గదికి తాళం
- ఇబ్బందుల్లో గర్భిణులు, మహిళలు
- జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నిర్లక్ష్యం

చిత్తూరు రూరల్: నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి నిత్యం ఓపీలు 1200 వరకు వస్తున్నాయి. సాధారణ జబ్బులతోపాటు అధికంగా గర్భిణులు, మహిళలు రోజుకూ 200 మంది వరకు వస్తుంటారు. వారికి తప్పనిసరి పరిస్థితుల్లో డాక్టర్లు స్కానింగ్ కోసం రాయిస్తుంటారు. అయితే స్కానింగ్ విభాగంలో పనిచేసే వైద్యులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, గర్భిణులను ముప్పుతిప్పలు పెడుతున్నారు. అక్కడి సిబ్బంది టోకన్ల పేరుతో స్కానింగ్ సేవలకు కత్తెర వేస్తున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య వచ్చిన వారికి టోకన్లు ఇచ్చేశామని, తరువాత వచ్చిన వారు మరుసటి రోజు రావాలంటూ తిప్పిస్తున్నారు. రోజుకు 30 నుంచి 40 మందికి మాత్రమే స్కానింగ్ చేసి తాళం వేసుకుని వెళ్లిపోతున్నారు. అవసరమైతే ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి స్కానింగ్ చేయించుకోండి అంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నారు.

మధ్యాహ్నానికే తాళం

స్కానింగ్ సేవలను ఉదయం 9.30–10 గంటల మధ్య ప్రారంభించి, మధ్యాహ్నం ఒంటి గంటకే తాళం వేస్తున్నారు. ఆ తర్వాత ఎంత మంది ఉన్నా ఇంటికి వెళ్లిపోవాలని తరిమేస్తున్నారు. ప్రశ్నిస్తే కుంటి సాకులు చెబుతున్నారు. కడుపు నిండుగా నీళ్లు తాగలేదని, ఇప్పుడు స్కానింగ్ మిషన్ పనిచేయడం లేదని, ఒక రోజుకు 70–80 మందికి మాత్రమే చేస్తామని, టోకెన్లు ఉండాలని, టెక్నీషియన్ లేరని, డాక్టర్ లేరని, మధ్యాహ్నంపైన వేరే విభాగంలో రిపోర్టులు ఇవ్వాలని ఇలా రకరకాల కారణాలు చెప్పి రోగుల ప్రాణాలతో ఆడుకుంటున్నారు.

సిఫార్సు ఉంటేనే..

స్కానింగ్ కావాలంటే, సిఫార్సులు ఉండాల్సిందే. కింది స్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారుల వరకు మనవాళ్లు అనే చెబితే వెంటనే స్పందిస్తున్నారు. క్యూలో ఉన్నవాళ్లను లెక్కచేయకుండా చకచకా స్కానింగ్ చేయిస్తున్నారు. అప్పుడే రిపోర్టు కూడా చేతిలో పెడుతున్నారు. దీంతో సామాన్యులకు స్కానింగ్ సేవలు అందని ద్రాక్షగా మిగిలాయి.

పట్టించుకునేవారు లేరు

అపోలో, ప్రభుత్వ ఆస్పత్రి బృందం మధ్య కోల్డ్ వార్ సాగుతోంది. ఈ క్రమంలో ఆస్పత్రి సేవలపై దృష్టి పెట్టలేకపోతున్నారు. వాళ్లు చూసుకుంటారని వీళ్లు.. వీళ్లు చూసుకుంటారని వాళ్లు ఎవరికి వారు బాధ్యతలను మర్చిపోతున్నారు. ఈ కారణంతోనే డ్యూటీ డాక్టర్లు, సిబ్బంది గర్భిణులు, మహిళలు, రోగుల పట్ల సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారంటూ అధికారులకు ఫిర్యాదులు వెళుతున్నాయి. అయినా ఫలితం మాత్రం శూన్యం.

స్కానింగ్ విభాగం తనిఖీ

ఫిర్యాదులు అందుకున్న ఉన్నతాధికారులు సాయంత్రం తనిఖీ చేశారు. చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న అల్ట్రాసౌండ్, ఎంఆర్‌ఐ, సిటీ స్కాన్ విభాగాలను శుక్రవారం డీఐఓ రవిరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్, రెన్యూవల్ వివరాలపై ఆరా తీశారు. రోజువారీ స్కానింగ్ వివరాలపై సిబ్బందిని విచారించారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవి ఉన్నారు.



ఆస్పత్రిలోని స్కానింగ్ విభాగాన్ని తనిఖీ చేస్తున్న డీఐఓ రవిరాజు

రేపు అనే మాట రాకూడదు



స్కానింగ్ విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటాం. స్కానింగ్ కోసం వచ్చేవారిని రేపు రమ్మని చెప్పకూడదు. దీనిపై విచారిస్తాం. కచ్చితంగా వారిపై చర్యలు తీసుకుంటాం. విధిగా ప్రతి ఒక్కరికి స్కానింగ్ చేయాల్సిందే. వచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తాం. ఇకపై సమస్యలు రాకుండా చూస్తాం.

–డాక్టర్ అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్, చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

విచారిస్తాం..



స్కానింగ్ సెంటర్‌పై వచ్చిన ఫిర్యాదుపై విచారిస్తాం. ఎట్టి పరిస్థితుల్లోను నిర్లక్ష్యం లేకుండా చూస్తాం. ఆ డ్యూటీ డాక్టర్, సిబ్బందిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. మధ్యాహ్నం తర్వాత కూడా స్కానింగ్ సేవలు అందేలా చూస్తాం. వచ్చిన వారందరికీ టోకన్లు ఇచ్చి అదే రోజు స్కానింగ్ చేసేలా చూస్తాం. ఇబ్బంది పడితే నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

–నరేష్‌కుమార్‌రెడ్డి, అపోలో నిర్వాహకులు

సీజనల్ వ్యాధుల నివారణే లక్ష్యం





దోమల నివారణ కార్యక్రమంలో మేయర్ అముద, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

- చిత్తూరులో 54 వేల గృహాలకు దోమల నివారణ మందు పిచికారీ
- చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో దోమల నియంత్రణ, సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట వేయాలని ప్రధాన లక్ష్యంతో ప్రతి ఇంటికి సైప్రాతిన్, దోమల నివారణ మందులను పిచికారీ చేస్తున్నామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. నగరంలో సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం చేపట్టిన ప్రత్యేక కార్యాచరణ కార్యక్రమాన్ని శుక్రవారం 39వ వార్డులోని పెద్ద హరిజనవాడలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, నగర కమిషనర్ అరుణ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధులబారిన పడకుండా ఉండేందుకు మునిసిపల్ కార్పొరేషన్ తొమ్మిది రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు వివరించారు. మేయర్ అముద మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కమిషనర్ అరుణ మాట్లాడుతూ చిత్తూరులో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి ప్రాణాంతక వ్యాధులను పూర్తిస్థాయిలో నియంత్రించడం కోసం మూడు రోజుల పాటు నగరంలోని ప్రతి ఇంటికి సైప్రాతిన్ దోమల నివారణ మందును పెద్ద ఎత్తున పిచికారీ చేయిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం 400 మంది పారిశుద్ధ్య కార్మికులు, మరో 41 మంది పర్యవేక్షణ అధికారులు, వార్డు కార్యదర్శులు సమన్వయంతో పనిచేస్తారన్నారు. ఇప్పటికే గుర్తించిన 72 హాట్‌స్పాట్ కేంద్రాల్లో ఆయిల్ బాల్స్ వేయడం, కాలువల్లో పూడిక తీయడం, పగటిపూట ఫాగింగ్, కాలువల్లో స్ప్రేయింగ్ చేయడం వంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ప్రజారోగ్యశాఖ అధికారి డా. లోకేష్, డీఈ వెంకటప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లోకనాదం, చిన్నయ్య, మెప్మా సీఎంఎం గోపి, ఏఈలు, వార్డు కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభం

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక రామ్‌నగర్‌కాలనీలో నగరపాలక సంస్థ, జేఎంసీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద ప్రారంభించారు. నాలుగు డివిజన్లకు తాగునీరు అందించే విధంగా తన సొంత నిధులతో వీటిని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ ప్లాంట్ ద్వారా గంటకు మూడు వేల లీటర్ల సామర్థ్యంతో ఆర్వో సిస్టమ్ ద్వారా శుద్ధినీరు అందుబాటులో ఉంచామన్నారు. నిర్వహణ నిమిత్తం 20 లీటర్ల క్యాన్‌కు రూ.2 వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు రూపాయల కాయిన్ వేస్తే క్యాన్ నీరు ఆటోమేటిక్‌గా వస్తోందన్నారు. అవసరమైన ప్రాంతాల్లో ప్లాంట్లను పెడతామన్నారు. కార్యక్రమంలో చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ జ్ఞానజగదీష్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లీనారెడ్డి, నాయకులు శివ, జగన్‌మోహన్, కార్పొరేటర్ పూర్ణ, కో–ఆప్షన్ మెంబర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోకులాష్టమి వేడుకలు

బంగారుపాళెం: మండల కేంద్రంలోని దళితవాడలో శుక్రవారం గోకులాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా మూడో రోజు గ్రామానికి చెందిన ప్రబోధ సేవా సమితి–ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక భజనగుడి వద్ద మధ్యాహ్నం కృష్ణభగవానుడి ప్రతిమను విశేషంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కృష్ణభగవానుడికి పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిపై కొలువుదీర్చి గ్రామ పురవీధుల మీదుగా మేళతాళాలు, చిన్నారుల నృత్య ప్రదర్శనల నడుమ కోలాహలంగా ఊరేగించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు వినీష్‌కుమార్, బాలాజీ, ధనుంజయ, సభ్యులు మునిరత్నం, వాణిశ్రీ, రేణుకాదేవి, రెడ్డెమ్మ, లత, హేమంత్, భానుమతి, దేవరాజులు, రేఖాకళ్యాణి, ఉదయ్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఆలయంలో అన్నదానం

చిత్తూరు రూరల్: శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా చిత్తూరు నగరం హైరోడ్డులోని శ్రీకృష్ణ ఆలయంలో శుక్రవారం పూజలు చేసి, భక్తులకు పెద్దఎత్తున అన్నదానం చేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రవీంద్రనాథ్, పాండురంగం, సురేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



హైరోడ్డులో భక్తులకు అన్నదానం చేస్తున్న ఆలయ నిర్వాహకులు

కాణిపాకం పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీ

కాణిపాకం(యాదమరి): కాణిపాక పోలీస్ స్టేషన్‌ను చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మధ్యాహ్నం కాణిపాకం పోలీసు స్టేషన్ తనిఖీల్లో పలు రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. భూ తగాదాలు, సైబర్ నేరాలపై గ్రామీణుల్లో చైతన్యం తేవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్ఐ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాస మూర్తి, చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి

గరుడవాహనంపై రాధాకృష్ణుల విహారం

యాదమరి: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా మండలంలోని పెరుమాళ్ల పల్లెలో గరుడవాహనంపై రాధాకృష్ణులు పురవీధుల్లో ఊరేగారు. భక్తులు హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు



మొక్క నాటుతున్న ఉపాధ్యాయులు

యాదమరి: మండలంలోని కాశిరాళ్ల ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వచ్ఛపక్వాడ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణంలో పాఠశాల హెచ్‌ఎం లలిత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మామిడి, జామ, కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకచ్చారి, భాస్కర్ రెడ్డి, మదనమోహన్ రెడ్డి, నరసింహారెడ్డి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే ఉచిత వైద్యం

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు పైసా ఖర్చులేకుండా ఇంటివద్దే వైద్యసేవలు అందిస్తున్నట్లు బొమ్మసముద్రం పీహెచ్‌సీ డాక్టర్ అనుష తెలిపారు. మండలంలోని చీలాపల్లె గ్రామంలో శుక్రవారం ఆమె ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 65 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యసిబ్బంది ఉమామహేశ్వరి, శిరీష, మల్లిక, సుప్రియ పాల్గొన్నారు.

దిగువతడకరలో ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్‌తో పేదలందరికీ మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని వైద్యాధికారులు ప్రియాంక, మోహన్‌వేలు తెలిపారు. శుక్రవారం మండలంలోని దిగువ తడకరలో డాక్టర్ ప్రియాంక, చెర్లోపల్లెలో డాక్టర్ మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు



పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ రజనీకాంత్

గుడిపాల: అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు ఇస్తున్నట్లు వసంతాపురం సర్పంచ్ రజనీకాంత్ అన్నారు. వసంతాపురం సచివాలయంలో శుక్రవారం నూతనంగా పింఛన్లు మంజూరైన వారికి ఆయన అందజేశారు. కార్యక్రమంలో సోషల్ మీడియా మండల కన్వీనర్ సాయిప్రతాప్, యువత అధ్యక్షుడు శిలంబరసన్, వెల్ఫేర్ అసిస్టెంట్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

తవణంపల్లె: ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సి.హరిరెడ్డి తెలిపారు. మండలంలోని పట్నం సచివాలయంలో శుక్రవారం నూతనంగా మంజూరైన 20 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పుష్పలత, పంచాయతీ కార్యదర్శి దేవిక, వెల్ఫేర్ అసిస్టెంట్ సునిత, వైఎస్సార్ సీపీ నాయకులు మధుకుమార్, సుకేష్ రెడ్డి, హరిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి అండగా ఉందాం

యాదమరి: సంక్షేమ పథకాల సారథి జగనన్నకు అండగా నిలబడి మరోసారి సీఎంగా చేసుకుందామని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పిలుపునిచ్చారు. మండలంలోని వరిగపల్లె సచివాలయ పరిధిలోని గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డితో కలసి ప్రతి గడపకు వెళ్లారు. ప్రజలతో మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత ఇంటి వద్దకే వచ్చిన పథకాల బుక్‌లెట్‌ను చూపించి వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో వచ్చిన ముఖ్యమంత్రుల కంటే మన జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రం ఎంతగానో అభివృద్ధి చెందుతోందని చెప్పారు. అంతేగాక మాట ప్రకారం ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు నేరుగా ఇంటికే చేరుతున్నాయని వివరించారు. మండల పరిధిలోని బెంగుళూరు–చెన్నై జాతీయ రహదారి నుంచి కుక్కలపల్లెకు తారురోడ్డు వేయాలని గ్రామస్తులు కోరారు. గ్రామాలలో మురుగు నీటి కాలువలు, సీసీ రోడ్లు వేయాలని కోరారు. దీనిపై ఆయా శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచారు. మండల పరిధిలో శుక్రవారంతో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, కార్పొరేటర్ ప్రకాష్ రెడ్డి, నాయకులు కుక్కలపల్లె విజయ్, శివారెడ్డి, దండపాణి, సురేష్ ఎస్ఐ సుమన్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

రేపు కథా సంపుటి ఆవిష్కరణ

చిత్తూరు రూరల్: రచయిత చంద్రశేఖర్ రచించిన స్వామిముత్తు నీరాజన కథా సంపుటిని లలితా కళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించనున్నట్లు వేదిక అధ్యక్షులు బాలక్రిష్టారెడ్డి తెలిపారు.

అపోలోలో ఫిజియోథెరపీ డే

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని అపోలో ఫిజియోథెరపీ కాలేజీలో శుక్రవారం ఫిజియోథెరపీ డే వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ కిరణ్ 200 మంది విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

30నుంచి శౌర్యజాగరణ యాత్ర

చిత్తూరు రూరల్: దేశ వ్యాప్తంగా ఈనెల 30 నుంచి శౌర్య జాగరణ యాత్ర నిర్వహించనున్నట్లు విశ్వ హిందూ పరిషత్ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే అన్నారు. చిత్తూరు నగరంలో ఆయన శుక్రవారం పర్యటించి మాట్లాడారు.